# పోలేరమ్మ బండ కాడ మా యిల్లు

మేము కసాబ్ గల్లీని యిడిచిపెట్టి పాతూరు లోని పోలేరమ్మ బండకాడికి మారిపోతా ఉన్నామని తెలిసినాక నా మనసు ఎట్టెట్లో అయిపోయి కడవంత దిగులు కమ్ముకొనింది.

ఇన్నాళ్లూ వాతో ఆడతా పాడతా ఉన్న మా యీది పిలకాయలతో యింక తెగ దెంపులే గదా అని గుర్తుకొచ్చి నా మొకంలో నీళ్లెగిరిపోయి నాయి. మా నాయిన ఇల్లు కట్టి యింత పనీ చేస్తాడని ఊయించని మా యీది పిల కాయలు కూడా నేను మారి పోతా వున్నానని తెలిసి బాగా డల్లయి పొయినారు. ఖుర్షీద్‌బీ కూతురు షమ్మీ కైతే ఏడు పొక్కటే తక్కువ.

'రే... యియ్యాలేనంట గదరా మీరెల్లిపోయేది' అంటా బాద పడతా వచ్చిందా పిల్ల, సామాన్లు సర్దతా వున్న మా అమ్మ నాయినమ్మల కాడ నిలబడి ఉంటే.

'అవునంట' అన్నాను, నేను కూడా బాదగా.

షమ్మీ గమ్మగా ఉండి పొయ్యింది. ఆ యమ్మి మనసులోని దిగులు నా కర్దమవతానే ఉంది. ఆడుకునే టవ్వడు గానీ, మా నాయినమ్మ కాడ తొడ బెల్లాలు పెట్టించుకుంటా ఉర్దూ పాటాలు నేర్చుకునే టవ్వడు గానీ మేము ఎంతగా తిట్టు కున్నా, ఎంతగా కొట్టుకున్నా చివరి నిమిషానికి మళ్లీ ఒకటై పోయే వాళ్లం.

ఒకటిగా కబుర్లు చెప్పకునే వాళ్లం. నన్ను నమ్ము కొని మా యీదిలోని మిగిలిన మొగ పిలకాయలతో అంతగా స్నేహం చేయని షమ్మీకి నేను ఎల్లిపోతా ఉన్నానన్న మాట ముల్లులా గుచ్చతా ఉంది.

'అయితే యియ్యాలే నంటరా మనం ఆడుకునే దానికి ఆఖరా?' అనింది షమ్మీ.

'అవును... యియ్యాలే ఆఖరు' అన్నాను నేను.

ఆ పిల్ల ఎంటనే 'దా... చెప్తా' అంటా నా చెయ్యి పట్టుకొనింది.

చెయ్యి యిడవకుండానే యీది చివరన ఉండే కాసింబీ బల్ల కాడికి పిలచ కెళ్లింది. ఆడకి పిలచ కెళ్లిందంటే ఆ పిల్ల ప్రేమగా దూద్ పేడాలు ( పాల పేడాలు) కొనిపెట్టబోతా ఉందని అర్దం.

'యిద్దో తిను. అన్నీ నీకే' అని, పావలాకి వచ్చిన అయిదు దూద్ పేడాలనూ నా చేతిలో పెట్టింది.

'నువు తినవా?' అన్నాను మరేదకి.

'ఉహు' అనింది.

నేను దూద్ పేడాలు తుంచి, నాలిక మీదేసు కుని మెత్తగా చప్పరిస్తా ఉంటే నా పక్కన బారంగా అడుగులేసిందా పిల్ల.

'ఇందాక మా అమ్మా, మీ అమ్మా జైబూన్ ఆపా బలేగా ఏడ్చుకున్నారు తెలుసునా? అందర్నీ యిడిచి పెట్టి పోతా ఉన్నందుకు మీ అమ్మయితే ఎక్కిళ్లు పెట్టేసింది' అంది షమ్మీ.

నేను ఆగినాను.

'అదేనా మా అమ్మ కళ్లు ఎర్రంగా ఉండాయీ' అన్నాను.

'అదే' అనింది షమ్మీ.

'ఛ... మా నాయిన యీ యీదిలోనే యాడైనా యిల్లు కట్టిచ్చుంటే బాగుండేది గదా.

మర్చిపోవుగా' అనింది ప్రాదేయ పూర్వకంగా.

వెడల్పుగా ఉండే ఆయమ్మి కాటుక కళ్లల్లో నీళ్లు ఉబికినాయి.

నాక్కూడా ఏడుపొచ్చింది.

'చచ... బలే దానివే' అన్నాను కళ్లమ్మట నీళ్లు తెచ్చుకుంటా.




ఆడాణ్ణో పాతూరులోనే కట్టించాలా?' అని, మా ఎడబాటుకు కారణమైన మా నాయిన్ను ఆడిబోసుకున్నాను.

షమ్మీ కూడా అదే మాట అనింది. అని నాలుగడుగులు ఏసినాక ఉన్నట్టుండి మునేళ్లతో నా గెడ్డం పట్టుకొనింది.

'రే... నువు ఆడకెళ్లినా నన్ను మర్చిపోవుగదరా. నీకు ఎన్ని మార్లు దూద్ పేడాలు కొనిపెట్టింది, ఎన్ని మార్లు తగువుల్లో సపోర్టింగు వచ్చింది

ఆ పొయంత్రం దాకా ఎక్కువ సేపు షమ్మీతోనే తిరగతా, మిగిలిన మా యీది పిలకాయలకి కూడా పేరు పేరునా ఎళ్లొస్తానని చెప్పినాను.

అందరూ బలే బాదపడినారు. గౌస్ జాన్ కొడుకు సందానీ అయితే తన గుర్తుగా అయిదు 'డైమండ్' మార్కు అగ్గి చెక్కలిచ్చినాడు ఉంచుకోమని.

(మా గోలీ లాటలో ఒక 'డైమండ్' మార్కు అగ్గి చెక్కంటే అయిదు రూపాయిలతో సమానం. అంటే ఒక డైమండ్ మార్కు అగ్గి చెక్కకు

అయిదు 'పెన్' మార్కు అగ్గి చెక్కలు చిల్లరగా వస్తాయి). నేను కూడా వాడికి బదులుగా నా దెగ్గిరున్న 'చీటా' మార్కు అగ్గి చెక్కలిచ్చినాను.

అందరూ 'ఖుదా హాఫీజ్' చెప్పినారు.

ఆ సాయంత్రమే వలా వెంకారెడ్డి, పెడెం రవి, మా యిల్లు కట్టిన బేల్దారు మాలకొండయ్య, బంధువులు, కసాబ్ గల్లీ వాళ్లు... అందరూ తోడు వస్తే బూడిద గుమ్మడి కాయను పగుల కొట్టి పోలేరమ్మ బండ కాడున్న కొత్తింట్లోకి మారి పోయినాము మేము.

ఆ రాత్రే పొట్టేలు కోపించి, కొత్తింటికి రక్తం చూపించి, అందరికీ బోజనాలు పెట్టించినాడు మా నాయిన.

కొత్తల్లో ఎట్టుంటదో ఏందో అని బయపడినాము గానీ కసాబ్ గల్లీ కళ కసాబ్ గల్లీదే. పాతూరు కళ పాతూరుదే. మా కావలి పుటక, పెరుగుదల పాతూరు నుంచే మొదలయ్యిందంట. అందువల్ల మా ఊరికి తల్లి వేరులా మట్టి మట్టిగా కళగా అచ్చు పల్లెటూరులా ఉంటుందది.


మా యింటికి నాలుగడుగుల దూరంలో ఉండే పోలేరమ్మ బండ కాణ్నుంచే మొదలవుతుంది పాతూరు. ఒళ్లంతా పసువు పూసుకొని, పై నుంచి కింది దాకా కుంకుమ బొట్టు పెట్టుకొని అమ్మోరిలాగా ఉండే పోలేరమ్మ బండకి దండాలు పెట్టకుండా పాతూరులో అడుగు పెట్టరు ఎవ్వరూ. ఆ బండకి నద్ది పొయ్యడం, తప్పెట్లు మోగించు కుంటూ వచ్చి మొక్కులు తీర్చుకోవడం వింతగా చూస్తా ఉండే వాణ్ణి నేను. యీడ నాకు బాగా నచ్చిన యింకో సంగతి యీడ బట్టినా పచ్చని యాపచెట్లు గలగలమని కొమ్మ లూపతా అవు పించడం. అయితే ఒకటే బాద. రోజులో ఒకసారన్నా బరెగొడ్ల ఉచ్చలు తొక్కకుండా, కాళ్ల కంటిన పేడను కరెంటు స్తంబాలకు పూయకుండా నడవడం సాధ్యం కాని పని.

పాతూరులో ఎనబై శాతం కాపరాలు రెడ్లవే కాబట్టి వాళ్లతో స్నేయితాలు, ముక పరిచయాలు ఉన్న మా నాయినకు అడ్జెస్ట్‌మెంట్ ప్రాబ్లమ్ పెద్దగా ఎదురవలేదు గాని మా అమ్మా నాయిన మ్మలు మాత్రం కొత్తల్లో అల్లాడి పోయినారు. కసాబ్ గల్లీలో 'క్యా' అంటే 'క్యా' అనే వాళ్లు అడుక్కొకరు అవపడతారు గానీ పాతూరులో మాత్రం మేము తప్పితే యింకో సాయిబుల జాడే లేదు. మా యింటి ఎదురుగా సాయింత్రమైతే గబ్బగియ్యంగా ఉండే గల్లీ స్కూలు, యింకో తట్టు ఇరిగేషను ఆఫీసు ఉండటంతో ఇరుగు పొరుగు అనే మాటే. లాక పోయింది మాకు.

'కూరలోకి రొంత కొత్తి మీరో, అంత అల్లం ముక్కో అడగడానికి కూడా ఎవరూ లేరు గదమ్మా' అంటూ అగచాట్లు పడతా ఉండేది మా అమ్మ.

ఆ తర్వాత్తర్వాత చుట్టు పక్కల ఆడోళ్లంతా మా అమ్మకు బాగా క్లోజయిపోయినా మా నాయి నమ్మకు మాత్రం ఈడ కసాబ్ గల్లీలో లేని లోటు తెలస్తానే ఉండేది.

దరూద్‌లు, ఫాతెహాలు, గ్యార్‌వీలు, ఖురాన్ చదవతా మదురాతి మదురంగా రాగాలు తీసే




ఆడవాళ్లు, సేమ్యాలు, రంజాను నెల వచ్చిందంటే ఒకరి నొకరు నిద్ర లేవుకొని నక్క పొద్దులు ఉండే సన్ని వేశాలు, సాయిబులు ఎక్కువగా ఉన్న చోట బిచ్చం కోసం వచ్చే ఫకీర్ల పాటలు, వాళ్లు మోగించే 'దాయ్‌రా'ల (చర్మ వాయిద్యం పేరు) ఛమఛమలు, మాంసం కూరలు, మసాల వాస నలు... ఇవన్నీ కసాబ్ గల్లీ నుంచి వచ్చినాక యీడ పోంగొట్టుకున్నట్టుగా ఉండేది మా నాయినమ్మ.

ఇంక నా సంగతంటారా?

మన ఆటలకి కొదవేమీలా. రెండు మూడు వారాల్లోనే కసాబ్ గల్లీలోకన్నా మరిగింతమంది స్నేయితులను సంపాదించేసుకొని పోలేరమ్మ బండ కాడ, గల్లీ స్కూల్లో, కచ్చేరి యాపచెట్టు కింద దుమ్ము లేపేయడం మొదులు పెట్టినాను.

కాకపోతే ఒకటి.

కసాబ్ గల్లీ తర్వాత నా స్నేయితుల్లో సాయిబనే వోడే లేదు.

**–మహమ్మద్ ఖదీర్‌బాబు**